# మంచు తెరలు



“ఆ నీలంచీరా, గులాబీరంగు ఫ్రాకూ విడివిడిగా పాక్ చేయించండి” అంటూ నాలుగు పదిరూపాయల నోట్లను కౌంటర్‌మీద పెట్టేడు శ్యామసుందర్. కొద్ది నిమిషాలలోనే కుర్రవాడందించిన పాకెట్లు తీసుకుని, సమీపంలో ఉన్న దుకాణంలో బాణాసంచా కూడా కొని సంచీలో వేయించి క్వార్టర్సు వంక నడవ సాగాడు.

చీకటిపడకపోయినా దీపాలు వెలుగుతున్నాయి.

రోడ్డు జనసందోహంతో నిండిఉంది.

మెల్లగా జనాన్ని తప్పించుకుంటూ అర్ధమైలు నడిచి అతనిల్లు చేరుకునేసరికి బాగా చీకటిపడి పోయింది.

ప్లాస్టిక్ సంచిలోంచి పాకెట్లు తీసి టేబుల్‌మీద పెడుతూంటే, అతనికా నీలిచీరను మళ్ళీ చూడాలని పించింది. సిలోఫెన్ పాకెట్‌లోంచి మిలమిల మెరుస్తున్న చీరను చేతుల్లోకి తీసుకుని మృదువుగా వేళ్ల చివరలతో ఆ పాకెట్టుని నిమిరేసరికి అతనికి నీరజ బుగ్గలు గుర్తుకొచ్చాయి. ఒక్కసారి ఆ స్పర్శ అతనిలో చాలా అనుభూతులను జ్ఞాపకాలను ఉదయింప జేసింది.

అతను లోపలకు వెళ్ళి ముఖం కడుక్కుని, తుడుచుకుంటూ తిరిగి ఆ గదిలోకి వచ్చేసరికి, టేబుల్‌ముందు నిలుచుని పాకెట్ తెరిచి ఫ్రాక్ పైకి తీయాలని తీవ్రంగా ప్రయత్నిస్తూంది శ్యామా!

శ్యామసుందర్ నవ్వుకుంటూ ఆమెవంకే చూడ సాగాడు.

తెల్లవారితే దీపావళి!

బాణాసంచా కాల్చుకుందుకు పిల్లలకీ, కొత్తబట్టలు కట్టుకుందుకు ఆడవాళ్లకీ మహదవకాశం కల్పించే పండుగ.

పక్క క్వార్టర్సులో పద్మమ్మ పిల్లలు టపాకాయలు పేలుస్తూ రేపు రాబోయే దీపావళిని ఇవాళే ఆట్టహాసంగా ఆహ్వానిస్తున్నారు.

పెద్దశబ్దంతో ఆటం బాంబ్ టపాకాయలు పేలేసరికి శ్యామ ఉలిక్కిపడింది. పాకెట్‌తో సహా ఆమెను ఒడిలోకి తీసుకుని యాపిల్ లాటి రెండు బుగ్గలపైనా మృదువుగా ముద్దుపెట్టుకుని “ఎలా ఉంది శ్యామా నీ ఫ్రాక్?” అంటూ అడిగాడు.

“బలేగా ఉంది మామయ్యా! థాంక్స్.”

శ్యామా ముద్దుగా కృతజ్ఞత తెలుపుతున్న ఆ క్షణాలలోనే నీరజ అక్కడకు వచ్చింది. ఆమెదృష్టి టేబులుమీద మిలమిల మెరుస్తున్న చీర మడతపై పడేసరికి — పెదవులు మందహాసంతో కొంచం విచ్చుకున్నాయి.

రెండడుగులు ముందుకువేసి ఆ పాకెట్టును చేతుల

లోకి తీసుకుంటూ "కాంప్లెక్షన్‌కి సరిపడే కలరు తెచ్చారు. ఈ స్కై_బ్లూ నాకు చాలా ఇష్టమని గుర్తుంచుకున్నందుక థాంక్స్" అందామె అతని ముఖంలోకి చూస్తూ.

ఆమె అభినందనలను సంతోషంగా అందుకున్నట్లు తనూ నవ్వేడు

ఒక్కక్షణం ఊరుకుని అడిగిందామె. "ఒక్కటే తెచ్చారేం? మీ అక్కయ్యో?" లోపలనుంచి శారద పిలుపు వినిపించింది. ఆమె సగంలోనే మాట ఆపేసింది. ఒక్కసారి అతని కళ్ళముందు వేయి మెరుపులు మెరిసినట్లయింది. ఆ మెరుపులలోంచి వెలువడిన తన కర్తవ్యం తలుచుకుని అతను తుళ్ళిపడ్డాడు.

"ప్లీజ్ . . అది విప్పకు నీరజా!" ఎలాగో అన్నాడు శ్యామసుందర్.

"ఏం? నచ్చేవ్సా?" కుతూహలం వ్యక్తపరుస్తూ చూసింది నీరజ.

అతను సమాధానం చెప్పకుండా ఆకస్మికంగా ఏదో సమస్య ఎదురైనట్లు గంభీరంగా మారిపోయాడు.

"నీరజా!" మళ్ళీ లోపలినించి పిలుపు.

ఇంకా ఆమె చీరవంకే చూస్తూ నిలబడటం గమనించి — "అక్కయ్య పిలుస్తూంటే వినబడటం లేదూ? నువ్వు త్వరగా వెళ్ళు. లోపల అక్కయ్య ఒక్కర్తీ ఏం బాధపడుతూందో?"

ఆమె ఒక్కసారి అతని ముఖంలోనికి చూసి విసురుగా వెళ్ళిపోయింది అక్కడినుంచి. ఆ వైఖరిచూసి అతని కనుమానం కలిగింది — 'నీరజకు కోపంరాలేదు కద?'

ఈ రెండు నెలల సాంగత్యంలోనూ నీరజను గురించి అతను చాలావరకు తెలుసుకోగలిగాడు. కాపరానికి వచ్చినా ఆమెలో ఇంకా చిన్నపిల్లల మనస్తత్వమే ఉండిపోయింది. కొంచం ఉద్రేకం కల మనిషి. దానికి కారణం ఆమెలోని పసితనమే. ఆ పసితనం నీరజలో ఒకరకమైన మాధుర్యం కలిగిస్తుంది అతని ఉద్దేశంలో. అందుకే ఆమెలో ఆ సున్నితమైన అమాయికత్వం ఏమాత్రమూ దెబ్బతినకుండా కాపాడుకుంటూ వస్తున్నాడతను రెండు నెలలనించీ. ఆమెపట్ల అతి జాగ్రత్తగా ప్రవర్తించడం దాదాపు అలవాటైపోయిందతనిలో.

'నిజంగా నీరజకు కోపం రాలేదు కద?'

అలా జరగకూడదు. నీరజకోపం తను భరించలేడు.

ఈ చలిరాత్రి . . వంటరితనం. బహు దుర్భరమైన శాపం. చాలా రాత్రులు నైట్‌డ్యూటీలోనే గడిచిపోయే తన కపురూపంగా లభించిన ఈ సువర్ణావకాశాన్ని వృథా చేసుకోవడం ఏమాత్రమూ తెలివైన పనికాదు.

"శ్యామూ!"

తలఎత్తి చూశాడతను. చీరకొంగుకి చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది శారదక్కయ్య.

"వంట అయిపోయిందా?"

"ఊఁ. పిండివంటలతో సహా అన్నీ అయిపోయాయి. నీకిష్టమని జిలేబీ చేశాను."

"పండుగకు వచ్చావన్నమాటేకాని నీకిక్కడా శ్రమ తప్పడంలేదు."

"ఆడవాళ్ళకి వంటలూ, వార్పులూ శ్రమేమీ కావులే. అయినా మీ బావగారికి తెలియకుండా కాంప్ కెళ్ళడమూ, నన్నిలా పంపడమూ జరగకపోతే ఇంత

**కట్టుకున్న ఆడదాని మనసుని నిర్లక్ష్యం చేసి మరొకరిని గౌరవించడం క్షమార్హంకాని అన్యాయం. పిల్లలు పుట్టేవరకు నవదంపతులు ఒకరి కోసం ఒకరన్న రీతిలో అనుబంధాలను పెంచుకొంటే, పిల్లలు ఆ బంధాలను గట్టిపరుస్తారు. అప్పుడే మాధుర్యం జీవితాంతం మధురంగా నిలుస్తుంది.**

త్వరగా మీ కొత్త కాపరం చూడటమే అయ్యేదికాదు. మిమ్మల్ని చూస్తూ పండగ గడపగలిగే ఆనందం ముందు ఈ శ్రమేపాటిది?" అంటూ కుర్చీ లాక్కుని కూర్చుంటూ అప్రయత్నంగానే ఆ చీర మడత వంక చూసిందామె. ఒక్కక్షణం . . .

"చీర తెచ్చావా!" ఆత్రత ధ్వనించిందామె స్వరంలో.

శ్యామసుందర్ ముఖం రంగులు మారింది.

ప్యాకెట్‌లోంచి చీర మడతను పైకితీసి భుజంమీద వేసుకుని ఏవో అంచనాలు వేస్తున్న ఆమెను చూసి, ఏదో అవాంఛనీయమైన విషయం తెలుసుకోవలసి వస్తున్నట్లతని మనసు చేదుగా అయిపోయింది.

"చాలా బాగుంది శ్యామూ!" చిరునవ్వుతో తన అభినందనలు తెలియజేసిందామె. కాని, అతనవి గ్రహించలేకపోయాడు.

ఈ వయస్సులో అక్కయ్యకి కూడా ఇటువంటి సరదాలు!

ఆశ్చర్యంవేసిందతనికి. అంతలోనే ఆశ్చర్యంమాని ఆలోచించసాగాడు. వయసుకీ సరదాలకీ అట్టే సంబంధం ఉండనవసరంలేదేమో? ఆడవాళ్ళకి అలంకారాలమీదా, చీరలమీదా ఆజన్మాంతమూ అభిమానమే. అయినా, అక్కయ్య ఏమంత వయస్సు మీరినదని? ముప్ఫయ్యేళ్ళు వచ్చినంతమాత్రాన, ఒక బిడ్డను కన్నంతమాత్రాన సరదాలు మిగుల్చుకోవడంలో అసహజతా, అన్యాయమూ ఏమున్నాయి? ఆమె తనకంటె ఆరేళ్ళు పెద్ద. నీరజకంటె పన్నెండేళ్ళు పెద్ద. తనకూ అక్కయ్యకూ మధ్యనున్న వయోభేదమే తన జీవితాన్ని కొంతవరకూ మెరుగు పరచగలిగింది.

అమ్మలా ఆదరించకపోయినా, నాన్నలా పెద్దచెయ్యకపోయినా, అక్కయ్య తనకు చాలాసార్లు సాయం చేసింది. ఇంటర్ చదువుతూండగా అప్పుడప్పుడు ఆర్థిక సహాయం చేసేది. అంతకంటె ముఖ్యంగా తను ఇంటర్ అయ్యాక ఉద్యోగం సంపాదించలేకఖాళీగా తిరుగుతూంటే తనకీ ఉద్యోగం రావడానికి కారణభూతురాలైంది. తమ పద్ధతుల మనిషనీ, రికమెండేషన్లపై ఉద్యోగం రావడం సహించడనీ తెలిసి కూడా ఎలాగో శ్రమపడి బావగారి పలుకుబడితో తనకీ ఉద్యోగం వచ్చేటట్లు చేసింది. అయితే ఆ విషయం ఉద్యోగంలో చేరాక కానీ తనకు తెలియదు.

ఇంటర్ పాసైన తనకీమాత్రం ఉద్యోగం దొరకడం కష్టమే. ఈ ఉద్యోగం పరోక్షంగా అక్కయ్య పెట్టించిన భిక్షే. కాని ఉద్యోగంలో చేరాక ఇంతవరకూ తను అక్కయ్య కేవిధంగానూ కృతజ్ఞత తెలుపుకోలేకపోయాడు. పరిస్థితులటువంటివి. కనీసం ఇప్పుడైనా తను కృతజ్ఞత తెలుపుకోవాలి. బంధువుగా తనింటికి వచ్చిన అక్కయ్య నేదోవిధంగా సత్కరించి పంపాలి.

అతని మెదడులో నీలి చీర మెదిలింది.

రేపు అక్కయ్యకాచీర ఇస్తే . . .

మరుక్షణం నీరజ గుర్తుకు వచ్చింది.

శారద, నీరజ — రెండు అవధులకీ నడుమ అతని ఊహలు ఊయలలూగసాగేయి. ఈసారి అతనికి తను చేసిన పొరపాటు స్పష్టంగా తెలిసి వచ్చింది.

ఆ చీర అందాన్నిచూసి, ముచ్చటపడి దాన్ని తీసుకోవడంలో తను నిజంగా చాలా పొరపాటే చేశాడు.

ఇంట్లో ఇద్దరాడవాళ్ళుండగా ఒక్క చీర తేవడం అన్యాయం. ఆ చీరలో నీరజను ఊహించుకుని త్వరపడి చీరను తీసుకున్న ఆ క్షణాలలో అక్కయ్య విషయం విస్మరించడం మహాపచారం.

చేజేతులా సమస్యను తెచ్చిపెట్టుకున్నాడతను. తనవద్ద పదిరూపాయలుమాత్రమే మిగిలాయి. వీటితో నెలాఖరువరకూ గడపాలి. అందరికీ పండుగే కనక అప్పు దొరకడం కూడా కష్టమే. అదీకాక ఇంతవరకూ జీవితంలో ఏనాడూ అప్పుచెయ్యలేదు తను. ఆ విషవలయంలో చిక్కుకుంటే అశాంతిలో మునిగిపోవడమే తప్ప బయటకు రాలేడని తనకు తెలుసు. ఆ కొట్టువాడిని అరువడుగుదామన్నా — తనీ స్టేషన్‌కి కొత్తగా రావటానా, ఎవరితోనూ ఏ విధమైన మొహమాటాలూ పెట్టుకోకపోవడానా అతను తనకి అరువివ్వడన్నది తథ్యం. అయినా అప్పులూ, అరువులూ తన సిద్ధాంతాలకి పూర్తిగా శత్రువులు. అందుకే జాగ్రత్తగా జీతంతో బ్రతకడం నేర్చుకోగలిగాడు. ఒక్కసారీ సిద్ధాంతం సడలితే — జీవితాంతమూ తనకి మిగిలేది బాకే. ఏమైనా సరే, తను తన ఆదర్శాలను వదలిపోకూడదనుకున్నాడు తను. . ఉన్నది ఒకే ఒక్క చీర.

అక్కయ్యా . . . నీరజా . . . ఇద్దరూ దాన్ని కోరుకుంటున్నారని ప్రత్యక్షంగానే తెలుసుకోగలిగాడు తను. నీరజ తన అర్ధాంగి. తన కష్టసుఖాలలో పాలు పంచుకోవలసిన వ్యక్తి. కాని తననూ తన పరిస్థితినీ అర్థంచేసుకోగలిగే ఎత్తుకి ఆమె ఎదగలేదు. వ్యక్తులనర్థంచేసుకుని పరిస్థితి కనుగుణంగా మెలిగే ఓర్పు నీరజకింకా ఏమాత్రమూ అలవడలేదు.

చీర తెచ్చినది తనకొరకు కాదని తెలిస్తే నీరజ చాలా మారిపోతుంది. ఈ విషయంలో తను ఏకాకి. ఆమె సహకారం లభించదన్నది నిశ్చయమైన విషయం.

అక్కయ్య. నిజంగా ఆమెకు కృతజ్ఞత సూచించుకుందుకిదే తరుణం. అన్ని విధాలుగానూ కలిసివచ్చింది అవకాశం. పండుగకు చీరపెట్టినట్లూ, గతంలో ఆమె చేసిన మేలుకి కొంతవరకైనా కృతజ్ఞత తెలుపుకున్నట్లూ అవుతుంది.

నీరజ . . తను . . అక్కయ్య. . .

ఈ త్రిభుజం ఎల్లుండి ఉదయం ఎలాగూ చెదిరిపోతుంది. రేపు ఒక్కరోజు. . . కాని — ఎలా ఎదుర్కోవడం ఆ రేపుని?

"కాళ్ళు కడుక్కుని భోజనానికి రా తమ్ముడూ!" అతని మనసులోని ఆలోచనల కానకట్టవేసిన అక్కయ్య పిలుపు విని శ్యామసుందర్ లేచి వెళ్ళాడు.

'అతి చిన్న విషయాన్ని తను అనవసరంగా అత్యధిక

ఇచ్ఛాపురపు రామచంద్రం

ప్రాధాన్యం యిచ్చి ఆలోచిస్తున్నానా?' అనిపించిందొక్కసారి, కాని ఎంత సరిపెట్టుకోబోయినా ... అతని సమస్య క్షణక్షణానికీ అంతులేనట్లు పెరుగుతూ అతని మెదడుని పూర్తిగా ఆక్రమించుకోసాగింది.

భోజనం చేస్తున్నంతసేపూ అతను అక్కయ్య ముఖంలోకికానీ, నీరజ ముఖంలోకి కానీ చూడకుండానే తప్పించుకున్నాడు.

•  •  •

కిటికీలోంచి ఆకాశంలో తారకలు మిలమిలా మెరుస్తూ కనిపిస్తున్నాయి.

శ్యామసుందర్‌కి నీరజ కళ్ళు గుర్తుకు వచ్చాయ్. ఆమెకు దగ్గిరగా జరిగి . . "నీ . . ర . . జా . ." అంటూ మెల్లిగా పిలిచాడు.

ఆమె అతని వంక చూసింది.

"ఏమిటాలోచిస్తున్నావ్?"

"ఆ నీలం చీరలో నేనెంత అందంగా ఉంటానా అని!"

షాక్ తగిలినట్లు ఆమెకు మళ్ళీ దూరంగా జరిగి చాలా భావాలు నిండిన కళ్ళతో ఆమెవంక చూసేడు. కాని, బెడ్‌లైట్ మసక వెలుతురులో. . . తన ఊహల సాంద్రతలో . . ఆమె అతని కన్నులలోని భావాలను కొంచం కూడా గ్రహించలేకపోయింది.

ఆడవాళ్ళకీ కొత్తచీరలకీ అవినాభావ సంబంధం.

నీరజ, అక్కయ్య ఇద్దరూ ఆడవాళ్ళు.

అతనికి నవ్వురాలేదు. జాలివేసింది.

రేపటి నీరజ ప్రవర్తనకి చాలా ప్రాముఖ్యం ఉంది. ఆమె మనస్ఫూర్తిగా సహకరించకపోతే దీపావళి ఆనందంగా గడవదు. అక్కయ్య దృష్టికి తను — నీరజ మధ్య ఏ కొంచెం దూరం తోచినా — ఆమె తమను చూసి జాలిపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. వద్దు వద్దు. . . తమ కొత్త కాపురం జాలిపడవలసినంత స్థాయికి దిగజారకూడదు. ఎలాగయినా నీరజకు నచ్చజెప్పాలనుకుంటూ అతను నీరజ వంక చూసేడు.

మంచుతో తడిసిన మందారంలా ముకుళించుకుని నిద్రపోతూంది.

"నీరజా . ." పిలిచాడు మెల్లిగా.

ఆమెలో కొంచమైనా చలనం కలిగించలేదా పిలుపు.

'నీరజ నిద్ర నటిస్తూందా?' అనిపించిందతనికి.

అలా అయితే ఆమెను నిద్రలేపడమూ, తను చెప్పదలుచుకున్న విషయాలు చెప్పడమూ — అన్నీ వ్యర్థమై — ఆమె ననవసరంగా రెచ్చగొట్టినట్లవుతుంది. ఆ చీర తనకు కాదని తెలిస్తే నీరజ భరించలేదు. ఆ విషయం ఆమెకు చెప్పి పరిస్థితిని విషమింపజేసుకోడంకంటె రేపటివరకూ మౌనంగానే ఉండటం మంచిదన్న నిశ్చయానికి వచ్చేశాడతను.

•  •  •

"ప్లీజ్ . . . ఎనిమిది దాటిపోతూంది . . . లేవండి. ."

అతను కళ్ళు తెరిచేసరికే బ్రష్షూ — పేస్టూ టేబిలుమీద పెట్టి వెళ్ళిపోయింది నీరజ. అతని కళ్ళకి మొదట కనిపించింది టేబుల్‌మీది చీర మడత!

వెండి తీగెలవంటి బోర్డర్లతో ఆకాశం లాంటి నీలిచీర.

చూడలేనట్లు వెంటనే అతను బాత్‌రూముకి నడిచాడు.

కొత్త ఫ్రాక్ తొడుక్కున్న శ్యామా గుడ్‌మార్నింగ్ చెప్పింది.

పళ్ళుతోముకుంటూ నీరజవంక చూశాడు శ్యామసుందర్.

లేయెండలో నిలుచుని శిరోజా లార్చుకుంటున్న దామె రోజాకంటె వెయ్యిరెట్లు అందంగా కనిపిస్తూ.

అతను స్నానంచేసి వచ్చేసరికి కూడా ఆమె అలాగే నిలుచుంది.

ఆమె చెక్కిళ్ళమీద పడుతున్న సూర్యకిరణాలు ఆ నునుపుతనాని కీర్ష్యపడి తమ మెరుపునికూడా ఆమె చెక్కిళ్ళపైనే వదిలేసి ఈర్ష్యగా జారిపోతున్నాయి. ఈ క్షణాలలో . . . నీరజ . . ఆ నీలిచీర కూడా కట్టుకుంటే. . . అతని మనస్సులో మధురమైన ఊహలు ఉదయించాయి.

ఒక్కసారి నీరజ ఏకాంతంలో కావాలనిపించింది. కాని అంతలోనే తను ఉంటున్న క్వార్టర్స్ విషయం గుర్తుకువచ్చి తన తీయని ఊహలను బలీయంగా చెరుపుకునేందుకు ప్రయత్నించసాగాడు.

కిచెనూ, డ్రాయింగ్‌రూమూ కాక మరొక చిన్న గది. ఇవీ తన ఇల్లు. మూడు గదులూ ఒకే వరసలో ఉండటంవల్ల ఇంట్లో అక్కయ్య ఉండగా పగలు పూట తమకు ఏకాంతం లభించటం అతికష్టం. ఒకవేళ తను త్వరపడి, కాంతులీనుతున్న నీరజ నున్నని చెక్కిళ్ళపై ప్రేమగా ఏమయినా చేస్తే — ఇద్దరూ అక్కయ్యకంట పడకా మానరు, ఆమె తమనిచూసి నవ్వకా మానదు.

"లోపలకు పదండి... టిఫిన్ తీసుకుందాం.."

నీరజ మాటలు విని అతను ముందు గదిలోకి వచ్చాడు.

టేబుల్‌కి మూడువైపుల కుర్చీలు. టేబుల్‌మీద మూడుపక్కల టిఫిన్‌ప్లేట్లూ మంచినీళ్ళూ అమర్చబడి ఉన్నాయి.

కొద్ది నిమిషాలలో నీరజా శారదాకూడా వచ్చి అతని కటూ ఇటూ కూర్చున్నారు. టేబుల్‌పై ఒక మూలగా ఆ చీర, నీలిచీర!

టీ తీసుకున్నాక మెల్లిగా అన్నాడు శ్యామసుందర్. "కొత్తబట్టలు కట్టుకునేది ఇప్పుడేగా?"

"ఉహుఁ . . ఇప్పుడు పసుపుపెట్టి, దీపాలు పెట్టేక కట్టుకుంటే ఆ వెలుగులో బాగుంటుంది—" సమాధాన మిచ్చింది శారద.

అదే క్షణంలో నీరజ ఏదో అనబోయి కూడా వదినను చూసి మానేసింది.

అతను గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు. పరీక్షాక్షణాలు వాయిదా పడ్డాయని క్షణికంగా సంతోషించినా ఆ క్షణాలెప్పుడైనా ఎదుర్కోక తప్పవని మరుక్షణమే గుర్తుకు వచ్చేసరికి అతని ఆనందం మటుమాయమై మళ్ళీ అశాంతే ఆవరించుకుంది. పడబోయే పిడుగుకోసం ఘడియలు లెక్కించడం అతి బాధాకరమని అతనికి తెలిసిందా క్షణాలలో.

ఎక్కడినించో పరుగెత్తుకువచ్చి శ్యామా అతని ఒడిలో వాలడంతో అతను మళ్ళీ ఊహాలోకంనించి వాస్తవంలోకి రావలసివచ్చింది.

"రైలుబళ్ళు చూపించవూ మామయ్యా?" గోముగా అడిగింది శ్యామా అతని చేయిపట్టుకుని లాగుతూ. శారదా నీరజల సాన్నిధ్యం నుంచి తప్పించుకుందుకే ఎదురుచూస్తున్న శ్యామసుందర్ ఆ అవకాశం వినియోగించుకోవాలని — "నేనూ శ్యామా అలా స్టేషన్‌కి వెళ్ళివస్తాం" అంటూ శ్యామాను నడిపించుకు వెళ్ళసాగాడు.

ప్లాట్‌ఫారం చివర వేపచెట్టు నీడలో సిమెంట్ బెంచిమీద కూర్చున్నాం ఇద్దరూ.

శ్యామా ఏవో యక్షప్రశ్నలు వేస్తూంది రైళ్ళను గురించి.

అన్యమనస్కంగా అతను జవాబులు చెబుతున్నాడు. అతని మెదడులోని ఆలోచనలకు మల్లె లైన్లమీది రైళ్ళు వస్తూ పోతూ ఉన్నాయి— రెండు నిమిషాలకు మించి ఏ బండీ ఆగనవసరంలేని చిన్న స్టేషనది.

అకస్మాత్తుగా ఒక ఆలోచన వచ్చిందతనికి.

"ఏదో ఒక వేలు పట్టుకో శ్యామా!" అంటూ చూపుడువేలూ, నడిమివేలూ మినహా మిగిలిన వన్నీ ముడిచి చెయ్యి ఆమె ముందుకి చాపేడు.

మామయ్య ముఖంలోకి ఓసారి చూసి, రెండు వేళ్ళనూ పరిశీలించి ఉంగరం మెరుస్తున్న చూపుడు వేలిని పట్టుకుంది శ్యామా. "గుడ్ —" అంటూ శ్యామాను దగ్గిరగా తీసుకుని అతను గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. విజేతలా గలగల నవ్వింది శ్యామా. ఒక్క నిమిషం పోయాక ఏదో అనుమానం వచ్చినట్లు "ఈవేలే ఎందుకు పట్టుకున్నావు?" అంటూ ప్రశ్నించాడతను కుతూహలంగా.

> **లాభనష్టాలు**
>
> న్యాయరహితమైన లాభంకంటె నష్టాన్నే ఆశించు; నష్టం ఒకసారే విచారాన్ని కలిగిస్తుంది; రెండవది శాశ్వతంగా విచారాన్ని అందిస్తుంది.
>
> —చిలో

"చిన్నదిగా . . . అందుకని..."

ఆమె సమాధానంలో అతనికేదో జీవనన్యాయం గోచరించినట్లయింది. ఆ క్షణంలో అతని కన్నులు కాంతివంతా లయ్యాయి.

మళ్ళీ ఆలోచనలు . . .

శ్యామా నిర్ణయం నీరజకనుకూలంగా ఉంది. కాని, తను అక్కయ్యపట్ల నెరవేర్చవలసిన విధిని విస్మరించడం న్యాయమేనా?

"ఇంటికి పోదాం మామయ్యా ... ఆకలౌతుంది." శ్యామా మాటలు విని అతను లేచాడు. ఒక్కసారి ప్లాటుఫారం కలయజూసి మెల్లగా శ్యామా వేలు పట్టుకుని నడిపించసాగాడు. తనలో తనకే అనిపించింది —'నేను చాలా అనవసరంగా ఆలోచిస్తున్నానా ఆ చీర గురించి—' అని. చిన్నప్పటినించీ అందరూ అనేమాటే "తనెక్కువగా ఆలోచిస్తాడతి చిన్న విషయాల గురించి కూడా" . . అని. ఇప్పుడా మాటలు నిజమే అని తనే రుజువు చేసుకుంటున్నాడు. తను చేసిన

పొరపాటు — చీర అందాన్ని చూసిన క్షణంలో అక్కయ్యను మరిచిపోవడం. ఆ పొరపాటుని సరిదిద్దు కునేందు కిన్ని ఆలోచనలూ, ఇంత ఆత్రతా. . .

వడ్డనకు కొంచెం ఆలస్యముంటుందని తెలిసి అతను ముందు గదిలోనే కూర్చుని మెదడుని ఆ చీరపై ఆలోచనలనించి మళ్లించాలని చేతిలోకి వారపత్రిక తీసుకున్నాడు. కళ్లు పంక్తుల వెంట మందంగా నడుస్తున్నాయ్. మనసుమాత్రం ఆ పుస్తకంమీద లగ్నం కావడం లేదేమాత్రమూ. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ తిరుగుతున్నట్లు అతని మనసు చీర— నీరజ — శారదక్కయ్యల చుట్టూ పరిభ్రమిస్తూంది.

నీరజ కూడా ఉండగా తనా చీరను అక్కయ్య చేతిలో ఉంచుతాడు. ఒక్కసారి నీరజ చిన్నబుచ్చు కుంటుంది. చిన్నతనంకొద్దీ. కాని, హుందాతనం సూచిస్తూ అక్కయ్య నీరజ ప్రవర్తనను గమనించి నట్లూ, ఆమె కోరిక నర్థంచేసుకున్నట్లూ ఆ చీరను ఆమె చేతిలో పెట్టి "చిన్నదానివి. నువ్వే కట్టుకో" అంటుంది. దానితో తన సమస్య తీరిపోతుంది. నిజంగా సమస్య పరిష్కారమైపోయినట్లే అనిపించి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు శ్యామసుందర్.

అక్కయ్య ఆ చీరను నీరజ కివ్వకపోతే ఏమవు తుందని ఆలోచించడానికి కూడా అతని ఆనందం అనుమతించలేదు.

శారద పిలుపు విని వంటింట్లో చేరుకున్నాడతను. తన ప్రక్క నీరజకుమాత్రమే కంచంపెట్టి ఉండటం చూసి— "నువ్వూ కూర్చో అక్కా!" అన్నాడతను.

"వద్దులే. మీరిద్దరికీ వడ్డించి మీరు తింటూంటే చూస్తూ ఆనందిస్తాను" అని నవ్వి నేతిగిన్నె అందు కుంది శారద.

అరగంట గడిచాక భోజనాల తతంగం ముగిసి ముగ్గురూ ముందు గదిలోకి వచ్చి కుర్చీ లాక్రమించేరు. శ్యామా పక్కనే చాపమీద నిద్రపోతూంది.

"కొంచెంసేపు పేకాడుకుందామా?" అడిగింది శారద పేకముక్కలందుకుంటూ.

"అలాగే కాని — అరగంట ఆడి నేను నిద్ర పోతాను" అన్నాడు శ్యామసుందర్.

"ఎందుకని?"

"మొదటి కారణం నువ్వు తినిపి తినిపి వడ్డించి నాచేత ఎక్కువగా తినిపించావు. రెండవది, ఇవాళ సెకండ్ నైట్‌డ్యూటీ..."

"పండగపూటా అర్ధరాత్రి డ్యూటీ తప్పదేదన్న మాట! కొత్తగా ఈ మధ్యనే పెళ్లయిన వాడివికదా, నైట్‌డ్యూటీలు వెయ్యవద్దని చెప్పలేకపోయావూ?"

"మా ఉద్యోగాలను గురించి నీకు తెలియని దేముంది? బుకింగ్ క్లర్కులు పండగలూ పబ్బాలూ పట్టించుకోకుండానగలూ,రాత్రీ పగలూ నౌకరీ చెయ్యాలి." నవ్వేడు శ్యామసుందర్.

"అచ్చంగా మీ బావగారికి డిటో లా ఉన్నమాట నీ పనికూడా! మరి — నీరజా, ఒంటరి రాత్రులెలా భరిస్తున్నావ్?" జాలిపడుతున్నట్లూ, పరిహాసం చేస్తు న్నట్లూ ప్రశ్నించింది శారద, నీరజవంక చూస్తూ.

అరగంట పేకాడి — అతను పంచుమీదవాలేడు. శారదా, నీరజా లోపలికి వెళ్లిపోయారు.

అతనికి నిద్రపట్టకుండా బాధిస్తున్నాయ్ నీలిచీర గురించిన ఆలోచనలు. ఆ కలవరం పెద్దగా ఆమాత్రమూ భరించ లేనట్లు గట్టిగా నిర్ణయించుకున్నాడు మనస్సులో.

'ఆ చీర నేను కృతజ్ఞతా పూర్వకంగా అక్కయ్యకే ఇస్తాను, ఆ విషయంలో ఇక తన నిర్ణయం మార్చు కోడు' — ఇలా అనుకున్నాక అతని మనసు తేలికపడి మెల్లిగా నిద్రపట్టసాగింది.

* * *

దీపాలు వెలుగుతున్నాయి. పూలచెండూ చిచ్చు బుడ్లూ కాంతి పుంజాలు విరజిమ్ముతున్నాయ్. అక్కయ్య ఆ నీలిచీర కట్టుకుని శ్యామాచేత కాకరపువ్వొత్తులు కాల్పిస్తూంది. తనమాత్రం ఆ ఆనందాన్నేమీ పట్టించుకోవడంలేనట్లే తన గదిలో కూర్చుండి పోయాడు.

విసురుగా ఆ గదిలోకి వచ్చి అంది నీరజ "రేపు సాయంత్రం నేను వాళ్ళూరు వెళతాను."

పిడుగు పడినంతగా చలించి "కారణ మడిగితే, కోపం రాదుగదా?" అన్నాడు తమాయించుకొని ధైర్యం తెచ్చుకుని.

"ఇంటికి వెళ్లేందుకు ప్రత్యేకంగా కారణాలుండా లనుకోను."

"ప్లీజ్. . . నిజం చెప్పు నీరజా! . . చెప్పవూ?" బతిమాలేడు.





సంబరం

ఫొటో—ఎస్. రామకృష్ణ (మయూరం)

"నేను నిజాలు చెప్పడమూ, మీరు వినడమూ — అంత అగత్యం రాకూడదు.

దీపావళికి అమ్మా నాన్నా మనని పిలిచారు. మీకు సెలవులేదని మనం వెళ్లలేదు. రేపు నేను వెళితే ఏం? మీతో గడుపవలసిన పండుగ ఇక్కడే గడిచిందిగా చాలా ఆనందంగా?"

ఆమె చివరి మాటలోని వ్యంగ్యం కొరడా తివరలా ఛెళ్లున తగిలింది అతనికి. అయినా మెల్లిగా సర్దుకుని— "గ్రహించాను నీరజా, నీకు చాలా కోపం వచ్చింది. నేను నేరమే చేశాను" అన్నాడు తను తప్పనిసరి పరిస్థితిలో ఆమెకు కోపకారణం అయ్యానని సంజాయిషీ యిచ్చుకుంటున్నట్లు.

అంటే తెలిసే మీరా నేరం చేశారన్నమాట!"

"అంగీకరిస్తాను నీరజా! నేను గత్యంతరం లేకనే అలా చెయ్యవలసి వచ్చింది. ప్లీజ్, యీ ఒక్కసారీ... క్షమించవూ?" ముద్దాయి స్థానంలో నిలిచినట్లు ప్రాధేయపూర్వకంగా చూసేడతను నీరజవంక.

ఆమె ఏమాత్రమూ కరుగకుండా "ఈ క్షణాల్లో... మిమ్మల్ని క్షమించడం ... నాతరంకాదు.." అంది స్థిరమైన కంఠంతో. కాని, ఆమె కళ్లలోమాత్రం...

"నీరజా!" తనామె కళ్లు తుడవాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

ఆమె దూరంగా వెళ్లిపోయి నిలుచుంది.

పరిస్థితి చేజారి పోతున్నట్లు గ్రహించి — "ఒక చీరకోసం నువ్వింత బాధపడతావని ఊహించలేదు..." అపరాధిలా అన్నాడు తను.

"ఆ చీరలో నేను కోరుకున్నది అందమూనాణ్యమూ కాదు. మీ దృష్టిలో నా స్థానం ఆ చీర ద్వారా తెలుసుకోవాలనుకుని, దానికి చాలా విలువలాపాదించుకుని ఆత్రతగా మీ నిర్ణయంకోసం చూసేను.

ఇన్నాళ్లూ నేను మీ గురించి, మీ మనసులో నా స్థానం గురించి భ్రమలలోనే గడిపానని నిరూపించింది మీ నిర్ణయం. నిజం ఇంత చేదుగా ఉంటుందని, మీరింత చేదుగా మార్చుతారని కలలో కూడా ఊహించని నాకు తీవ్రమైన ఆశాభంగం కలిగింది. అందుకే ఇప్పుడు నేను చాలా పశ్చాత్తాప పడుతున్నాను."

"సారీ, నీరజా. ఈ విషయంలో నా అపరాధం చాలా తక్కువ. ఇంటికి వచ్చిన అక్కయ్యను గౌరవించాలన్న ఉద్దేశంలో — మన నడుమ చాలా సామీప్యాన్ని ఊహించుకుని, నువ్వు నన్నర్థం చేసుకోగలవనే ధైర్యంతో ఆ చీరను అక్కయ్యకిచ్చాను. అక్కయ్య పట్ల నా విధి తెలిసి కూడా నువ్వు నన్నపార్థం చేసుకున్నావు." అంటూ ఆమెముందు తన హృదయాన్ని విప్పి పరిచేడు.

ఆమె కొంచెమైనా శాంతించలేదు సరికదా మరింత ఉగ్రురాలై ... "అవును. మీకు అక్కయ్యతో ఉన్న అనుబంధపు విలవలముందు నాపై ఉన్న అనురాగపు విలవలు చాలా తక్కువ. ఆమెపట్ల ప్రదర్శించవలసిన కృతజ్ఞతా గౌరవాలతో సరిపోల్చితే నాపై చూపవలసిన ప్రేమ చాలా అల్పం. ఇదేగా మీ ఉద్దేశం? నేను చాలా మోసపోయాను. వివాహం అయ్యాక స్త్రీ తన సర్వస్వాన్నీ భర్తకి అంకితం చేసుకుంటుంది కానీ అతను మాత్రం... దుర్మార్గంగా...."

"నీరజా!" ఆమె మాటలను వినలేకపోయాడు తను.

"మీ మాటలు విని మోసపోయేటంత అమాయకత్వమూ మంచితనమూ కొన్ని నిమిషాల క్రిందట మీరే నాలో అంతం చేసేశారు.

భార్యాభర్తల అనుబంధంకంటె సోదరీ సోదరుల సంబంధమే అధికమని మీరు భావించినప్పుడు — భార్య ఇష్టానిష్టాలకంటె బంధువుల గౌరవ మర్యాదలే మీకతి ప్రధానమని తోచినపుడు, నే నిక్కడ ఉండటానికీ, ఉండకపోవటానికీ ఆట్టే వ్యత్యాసం ఉండదు.

ఈ చీర నీకోసమే నీరజా అని మీరు మొదట ప్రేమతో నాకిస్తే నేను కోరుకున్న విలవలు లభించాయన్న తృప్తితో దాన్నెలాగూ వదినకే ఇచ్చి ఉండేదాన్ని. కాని, మీరలా చెయ్యలేదు. మన అనురాగాలూ, దాంపత్యమూ బలహీనమైనవని రుజువుచేశారు. నా కలలను సమూలంగా నాశనం కావించేరు.

నన్ను వెళ్లనివ్వండి. మీగురించీ, మీ హృదయంలో నాపై ఉన్న మీ ప్రేమగురించీ ఊహించుకున్న ఔన్నత్యాలు చెదరిపోయాక మీ సన్నిధిలో నేను హృదయఃపూర్వకంగా గడపలేను.

ఎన్ని లోపాలున్నా దాంపత్య బంధం నేను తెంచుకోలేను. తాత్కాలికంగా దూరమైతే మనుషుల విలవలు తెలిసివస్తాయేమో!

కొన్నాళ్లు మీనుంచి దూరంగా ఉంటే మళ్లీ మీగురించి ఏవేవో ఊహాహర్మ్యాలు నిర్మించుకుని— తిరిగి వచ్చాక మళ్లీ మీరు వాటిని భగ్నంచేసి చేదు నిజాలు తెలియజేసేవరకూ కొన్నాళ్లయినా మీతో ఉండగలుగుతాను."

తను నిర్విణ్ణుడై చూస్తూ మిగిలిపోయాడు.

నీరజ పెట్టెలో బట్టలు సర్దుకుంటూంది.

ఎంత తీవ్రమైన నిర్ణయానికి వచ్చింది నీరజ! ముప్ఫై రూపాయలు విలవచేసే చీరకు అమూల్యమైన దాంపత్యపు విలవల నాపాదించి...

ఇలా జరుగుతుందని, నీరజ ఇలా ఆలోచించిందని ఏమాత్రంతెలిసినా ముందుగానే జాగ్రత్తపడేవాడుతను. ఇప్పుడు తను చేయగలిగేదేముంది, చేజారిన క్షణాల విలవలను గుర్తించి పశ్చాత్తాప పడటంకంటె?

అటువంటి చీరేకాదు — ఆఖరికా చీరే అక్కయ్యనించి తీసుకుని ఇచ్చినా నీరజ మనస్సు మార్చుకోదు... ప్రయాణం ఆపుకోదు.

ఇది నూటికి నూరుపాళ్లు నిజం.

రెండురోజులుగా నీరజా, తనూ, శారదక్కయ్యా, శ్యామా.

రేపు ఉదయానికి తనూ నీరజా.

రేపు సాయంత్రానికి . . తను . . భరించలేని ఒంటరితనంలో.

తుళ్లిపడి కన్నులు తెరిచాడు.

మంచాని కతిసమీపంగా నిల్చుని టాయ్‌గన్ పేల్చింది శ్యామా.

కళ్ళు నులుముకుని చూశాడు శ్యామసుందర్.

ఇంతవరకూ జరిగింది నిజంకాదు. కల!

వేయి కొండల భారం ఒక్కసారి గుండెల మీదనించి తొలగినట్లయింది. కాని — కలలోని నీరజకూ— వాస్తవంలో నీరజకూ పోలికలు స్ఫురించి ఆ కల నిజంగా మారిపోవడానికి అవకాశం లేకపోలేదనుకున్నాడు, నీరజ మనస్తత్వం నెమరువేసుకుంటూ.

నిద్రపోయే ముందు స్థిరపడిపోయిందనుకున్న మనస్సు మళ్లీ ఉయ్యాల లూగసాగింది. ఏ సమస్యను పరిష్కరించగలిగాడనుకున్నాడో అది మళ్లీ ఘనీభవించ సాగింది. ఈసారి తన మెదడుని ఆయస్కాంతంలా తన వంక ఆకర్షించుకుంటూ౦ది నీరజ.

అతను లేచి ముఖం కడుక్కొని వరండాలోకివచ్చాడు.

చీకటికోసం దీపాలెదురుచూస్తున్నాయి. దీపాల ప్రతిభ చీకట్లలోనే.

లోపల మట్టి ప్రమిదలలో నూనెపోసి, వత్తులు వేసి సిద్ధంచేస్తూంది అక్కయ్య. ఒక్కొక్కటీ బహు జాగ్రత్తగా తెచ్చి నీరజ కందిస్తూంది శ్యామా.

ఇంటిముందు వలయాకృతిలో ప్రమిదలమర్చు తూంది నీరజ.

ఎవరో వచ్చి తీపి పంచి వెళ్లారు.

ఊరించి ఊరించి వచ్చిన చీకట్లు దట్టమవు తూంటే నీరజ వెలిగిస్తున్న దీపాలు మరింత ప్రతి భాయమానా లౌతున్నాయి.

ఎవరో ఎదురుగా వెలిగించిన భూచక్రం గిర్రున తిరుగుతూ పువ్వులు విరజిమ్మింది. దీపాలమధ్య కాంతి పుంజాల మధ్య, ప్రతిమలా, సాలభంజికలా నీరజ.

ఆ నీలిచీరకూడా కట్టుకుంటే నీరజ సౌందర్యం నిరుపమానంగా శోభిస్తుంది.

ఒక్కసారి తన ఆదర్శాలనీ సిద్ధాంతాలనూ వదిలేసి మరొక చీర తేవడానికి ప్రయత్నిస్తే? మెదడు అతన్ని నిలదీసింది.

ఎందరో మహానుభావులు ఆదర్శాలకోసం, సిద్ధాం తాలకోసం ప్రాణాలర్పించారు. వారిముందు తనూ తన సమస్యా ఏమాత్రం? చిన్న నియమాన్ని కాపాడు కోలేని తను జీవితంలో ఏం సాధించగలడు?

అతనాగిపోయాడు. రాబోయే విషమక్షణాల నెదుర్కొందుకు ధైర్యాన్ని కూడగట్టుకోసాగేడు.

ప్రతి నిమిషమూ గంటలా గడుస్తూంది.

లోపలనుంచి శారద వచ్చి దీపాలనూ, దీపాల మధ్య నీరజనూ చూస్తూ, "ఇప్పుడు కొత్తచీర కట్టుకుంటే బాగుంటుంది" అంది.

అతని చివరి ఆశాకిరణం కూడా ఆరిపోయింది. తన చేతులతో ఆ చీరను ఇవ్వనవసరం లేకుండా వాళ్లి ద్దరూ ఏ నిర్ణయానికయినా వచ్చి ఉండరా అని ఆశపడ్డాడు. కాని, పరీక్షాపత్రం అందుకోబోతున్న విద్యార్థిలా తడబడుతున్న అడుగులతో గదిలోకి నడవక తప్పలేదు.

చాలా గంభీరత్వం ప్రదర్శించాలని లోలోన తాప త్రయపడుతూ ఆ చీర మడతను చేతుల్లోకి తీసుకుని భయంగా చూసేడు. అతని చేతులు కొద్దిగా కంపి స్తూండటంవల్ల చీర మడత కొంచం చలిస్తూంది.

ఈ నీలిచీర, నీరజ కట్టుకుంటే అందాలు తెచ్చు కుంటుంది.

ఈ నీలిచీరే, శారదక్కయ్య కట్టుకుంటే ఆమె కందమిస్తుంది.

ఒక్కసారి అతను తలెత్తిచూశాడు.

అక్కయ్య... నీరజ... ఇద్దరూ కుర్చీలలో దగ్గిరగా కూర్చున్నారు.

ఒక్కక్షణం — సంకోచించాడతను.

ఆ ఇద్దరిలోనూ ఒకరికే ఈ చీర.

అర్థాంగి నీరజ... అక్కయ్య శారద.

తన హృదయంలో హృదయం నీరజ.

తన జీవితాన్ని ఉద్ధరించిన శారదక్కయ్య.

అతనికి చాలా ఆత్రతగా ఉందని ఆ ఇద్దరికీ తెలియదు. వాళ్ళు చాలా ఆత్రతగా ఎదురుచూస్తున్నా రని అతనికీ తెలియదు.

కల. . . కలలో నీరజ . . .

తన జీవితం దాని వెనక అక్కయ్య చేయూత.

"త్వరగా రండి, మతాబులు కాల్చుకోవాలి." గట్టిగా కేకవేసింది శ్యామా బయటనుంచి. అతను కొంచం ముందుకు వంగేడు. అతని చేతులలోంచి చిత్రంగా జారింది చీర మడత ... దాన్ని ఏ చేతులందుకున్నాయో అతనూ చూడలేదు.

లక్ష నేరాలు చేసి శిక్ష కెదురుచూస్తున్నట్లు తల దించేసుకునే కూర్చున్నాడు.

చీర రెపరెపలుమాత్రం, ఒక దిక్కుడినుంచి లోప లకు వెళ్లారని చూచించాయి.

> **ఉద్రేకం**
>
> క్షణికోద్రిక్తతను అదుపులో పెట్టుకోగలిగినవాడు ఒక రోజు విచారాన్ని నివారించగలుగుతాడు.
>
> —బైరాన్ ఎడ్వర్డ్స్

వర్ణనాతీతమైన క్షణాలు కొద్దిగా గడిచాయి.

ఇంకా అతను తలెత్తి చూడగలిగే ధైర్యమూ శక్తీ కూడదీసుకోలేక అలాగే స్థాణువుకి మల్లె కుర్చీకంటుకుపోయాడు.

తన సమస్య ఇంత క్రూరంగా అంతమవుతుందని తెలిస్తే... తను...

ఆలోచనలు భరించలేక అతను తలఎత్తి చూసేడు.

ఆ కళ్లల్లో తన కృతజ్ఞతకు ఫలితం కనిపిస్తూం దనిపించింది.

అక్కయ్య తనవంకే చూస్తూంది, అతి పరిశీలనగా, ఆమెకు తను చేసిన అన్యాయమూ అగౌరవమూ భూతద్దంలోంచి కనబడసాగాయి కళ్ళముందు. భరించ లేని మౌనాన్ని భగ్నంచేయడానికి కూడా ఓపికలేనట్లు — "నన్ను మన్నించు..." అని గొణిగా డెలాగో.

ఆమె నిశ్చబ్దంగా ఉండిపోయింది పరిశీలిస్తున్నట్లు చూస్తూ.

"నేను . . పొరపాటే . . . చేశాను... క్షమించు" ఒక్కసారి కొంచెం చలించి ఆమె చిరునవ్వునవ్వుతూ ... "నువ్వు జయించావు తమ్ముడూ. అభినందనలు...." అంది.

తన భార్యాలోలత ఎత్తిపొడుస్తున్న అక్కయ్య వంక చూడలేనట్లు తలదించుకున్నాడు శ్యామసుందర్.

ఇంకా అతన్ని బాధించడం ఇష్టంలేనట్లు — "శ్యామూ! నీ పరిస్థితి నాకు తెలుసు. నన్ను నమ్ము... నిజంగా నీ నిర్ణయం చాలా సమంజసంగా ఉంది." అంది శారద.

"నీ మనసు చాలా విశాలమని నాకు తెలుసక్కా కాని. . . నీరజ. . . "

తను ఊహించినట్లు నీరజ ఆ చీరను అక్కయ్య కివ్వకపోవడంతో ఆమెమీద, ఆమె అమాయకత్వం మీద అతనికి కొంచెం కోపం వచ్చింది.

"నాకు చాలా విషయాలు తెలిశాయి శ్యామూ! నీ నిస్సహాయస్థితీ... నీరజ మనసూనూ అర్థం గ్రహించి కూడా ఏమ్నాకూరి పరీక్షించాలని నీరజా నేనూ ఆత్రయపడినట్లే నటించాము. మేము పెట్టిన పరీక్షలో నువ్వు గెలిచావు. . . "

అర్థంకానట్లు చూసేడు శ్యామసుందర్. శారద ఏదో చెప్పబోయి ఆ క్షణంలోనే కొత్తచీర కట్టుకున్న నీరజ గుమ్మంవరకూ వచ్చి ఆపేసింది.

"కట్టుకున్న ఆడదాని మనసుని నిర్లక్ష్యం చేసి మరొకరిని గౌరవించడం చాలా అన్యాయమని నా ఉద్దేశం. ఇవాళ దీపావళి. మీ మన కాపురంలో తొలి దీపావళి. నీకు నీరజ ఆనందం—నీరజకు నీ సంతోషం. వీటికంటె మరొకటి ప్రాధాన్యం కాకూడదివాళ."

"అక్కా!"

"అవి నా కాపరపు తొలి రోజులు. ఆ రోజులలో నా భావాలూ కోరికలూ తెలియచేసే అవసరంలేదు మీకూ తెలుసు కనుక. క్రొత్త నా ప్రవాహంలో పడి పోకుండా ఉండాలని చాలా జాగ్రత్తపడుతూ నా మనసుని చిత్రవధ చేసేది అత్తగారు. ఆవిడకి మల్లె పూలు తెచ్చినా ఆవిడ చేతులమీదుగానే నా కందాలని ఆంక్షలు విధించేది. ఆమెకి, ఆమె పెద్దరికాన్నీ అపరి మితంగా అపహ్యాంచుకుని లోలోన కుమిలిపోయేదాన్ని. మా ఇరువురిమధ్యా అడ్డుగోడ వెలువరించి ఆవిడ చేసే ప్రయత్నాల నేమాత్రమూ తొలగించలేకపోయేదాన్ని. ఆ బాధలన్నీ మరిచిపోలేను నేను.

తమ్ముడూ! పిల్లలు, పెద్దల మధ్య బంధాలను కాపాడగలరు. కానీ పిల్లలు పుట్టేవరకూ అయినా దాంపత్యం ఒకరికోసం ఒకరన్నట్లే సాగాలి. అప్పుడే ఆ మాధుర్యం జీవితాంతం మధురంగా నిలుస్తుంది. మీ దాంపత్య జీవితంలో మూడవ వ్యక్తి అడ్డు నిలవగలిగే పరిస్థితి ఏనాడూ కలిపియకు.

నీరజా! . . ఈ మాటలు తమ్ముడికే కాదు. నీక్కూడా!" నవ్వింది శారద.

కొత్తచీరలో నీరజ, కోటి దీపాల కాంతి కళ్లల్లో నింపుకున్న నీరజ—ఆమె కభివందనం చేయబోయింది. కాని శారద ఆమె చేతులను పట్టుకుని — "పొరపాటు చేయకు ... ముందు మా తమ్ముడు. తరవాత నాకు." అని శ్యామసుందర్ వంక తిరిగి— "తమ్ముడూ.... నీరజ నమస్కరిస్తుందిట. ఇద్దరూ వచ్చేం బహుమ తివ్వాలి!" అంది.

శ్యామసుందర్ కూడా సిగ్గుపడిపోయాడు నీరజ తోపాటు.

"కొత్త దంపతుల మధ్య అడ్డునిలవడం నాకూ మంచిది కాదు. మిమ్మల్ని ఏకాంతంగా వదిలి నేను శ్యామాదగ్గిరకు పోతాను."

ముసిముసినవ్వులు నవ్వుతూ గదిదాటి వెళుతున్న శారద తలుపులు దగ్గిరగా లాగి మరీ వెళ్లిపోయింది. ★